

ఉల్లి, టమోటా అందుబాటులో ఉండాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 26: ఉల్లి, టమోటా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో టమోటా, ఉల్లి ధరల నియంత్రణ కమిటీ సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఉల్లి, టమోటాలను నో లాస్-నో గెయిన్ కింద రైతుబజార్లలో విక్రయించాలని అన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ నారాయణ మూర్తి, డీఎస్‌వో మూర్తి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆదోనిలో రేషన్ దందా

ఆదోని, జూన్ 26:

రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఆదోని కేరాఫ్‌గా మారింది. ఆదోని, ఆలూరు మండల స్టాక్ పాయింట్ల నుంచే బియ్యం తరలించి గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వినించాయి. రేషన్ బియ్యం కర్ణాటకకు అక్రమ రవాణా చేసి ఆదోని చిన్న బాసు రూ. కోట్లకు పడగలెత్తారు.

- మండల స్టాక్ పాయింట్ నుంచే బియ్యం రవాణా
- కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్న అధికారులు
- కళ్లు మూసుకున్న విజిలెన్స్ అధికారులు

గత వైసీపీ పాలనలో మండల స్టాక్ లిస్ట్ పాయింట్ నుండి రేషన్ బియ్యం అక్రమంగా కర్ణాటక సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి వ్యవహారం చూస్తే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుందామన్న సామెత గుర్తుకొస్తోంది. టీడీపీ అధికారంలోకి వచ్చాక కూడా ఎవరూ గమనించరనే ఉద్దేశంతోనే ఏకంగా స్టాక్ పాయింట్లు ఉన్న అధికారే నకిలీ ఆర్‌వో బిల్లులు ఏర్పాటు చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు సిద్ధపడ్డారు. అందులో భాగంగా ఆలూరు మండల స్టాక్ పాయింట్ నుండి సోమవారం రాత్రి ఏపీ39టీఆర్8202 నెంబర్ నెంబర్ గల లారీలో 200 క్వింటాళ్ల పైగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలించేందుకు సిద్ధమయ్యారంటే వారు ఎలాంటి వారో ఇట్టే అర్థమవుతోంది.

● ఆలూరులో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ...

స్థానిక యూట్యూబ్ ఛానల్‌లో పనిచేస్తున్న సిబ్బంది రేషన్ బియ్యం తరలిపోతున్నట్లు తెలుసుకొని ఫోన్ మీద వారితో చర్చించారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారి నుంచి ఫోన్‌పే ద్వారా రూ.31వేలు తీసుకొని లారీని వదిలేశారు. అయితే ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌తో పాటు మరో ఇద్దరు రిపోర్టర్లుకు ఈ సమాచారం రావడంతో ఈ దందా బట్టబయలు చేశారు.



రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని హొళగుంద దగ్గర పట్టుకున్న దృశ్యం (ఫైల్)



లారీలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

గతంలో చిన్న బాసు కనుసన్నల్లోనే..

ఆదోని నియోజకవర్గంలో చిన్న బాసుగా చలామణి అవుతున్న ఓ వైసీపీ యువ నాయకుడి కనసన్నల్లోనే రేషన్ అక్రమ రవాణా దందా కొనసాగుతోంది. ప్రతిరోజూ రెండు నుంచి ఐదు వాహనాల వరకు రవాణా జరుగుతోంది. ఈ అక్రమ దందాలో వచ్చిన సొమ్ముతో సదరు నాయకుడు తార్ జీపులను తెచ్చుకుని పట్టణంలో యథేచ్ఛగా తిరుగుతున్నాడు.

కొందరు జిల్లా అధికారుల అండ..

రేషన్‌ను అక్రమంగా తరలిస్తున్న వారికి జిల్లా అధికార యంత్రాంగం కూడా సహకరిస్తోందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అనేక సందర్భాల్లో ఆదోని, ఆలూరు మండల స్టాక్ పాయింట్ల నుంచి అక్రమ బియ్యం లారీలను పంపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఆలూరులో సివిల్ సప్లై గోదాంలో పనిచేస్తున్న ఓ మహిళా అధికారి 500 బస్తాల రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు పంపి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. అదే సమయంలోనే జిల్లా అధికారులు విజిట్ చేస్తున్నట్లు తెలుసుకున్న ఆ అధికారి ఆదోని మండల స్టాక్ పాయింట్ నుండి 500 బ్యాగుల బియ్యం ఉన్న లారీని ఆలూరుకు తరలించినట్లు ఆరోపణలు వినిపించాయి. సివిల్ సప్లయ్ గోదాములో పని చేస్తున్న కొంతమంది అధికారులు మధ్యానికి బానిసలు కావడం, వారు కర్నూలు, ఇతర సుదూర ప్రాంతాల్లో నివాసం ఉండటంతో ఇక్కడి నుంచి రాత్రిళ్లు కొందరు గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటకకు బియ్యం తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

8 నెలల క్రితం విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు 126 అక్రమ రేషన్ బియ్యం బస్తాలు తరలిస్తుండగా, వలపన్ని పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని ఆలూరు స్టాక్ పాయింట్‌లో వచ్చారు. ఆ రేషన్ బియ్యాన్ని స్టాక్ పాయింట్ అధికారులు కర్ణాటకకు తరలించారు. సోమవారం రాత్రి పట్టుకున్న లారీలో ఈ బియ్యం ఉన్నట్లు హొళగుంద రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు సమాచారం.

● నిద్రమత్తులో జిల్లా అధికారులు

రేషన్ బియ్యం ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలి వెళ్తున్నా జిల్లా పౌర సరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు నిద్రమత్తులో తూగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ శాఖలో అధికారులు రేషన్ బియ్యం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలి. కానీ వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డీలర్లు స్టాక్ రిజిస్టర్లు చూపి, చేయి తడిపితే చాలు అందుకు తల ఊపుతున్నారు. బియ్యం లబ్ధిదారులకు అందుతోందా? లేక మాఫియాకు అక్కడే అమ్ముతున్నారా...? అధికారులు, డీలర్లు ఇందుకు సహకరిస్తున్నారా..? అని పర్యవేక్షించడం లేదు. ఆయా స్టాక్ పాయింట్లు పౌరసరఫరాల అధికారులు లంచాలకు అలవాటు పడి ఈ రేషన్ మాఫియాకు సహకరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అందుకే విజిలెన్స్ శాఖ అధికారులే ఎక్కువగా దాడులు చేసి రేషన్ బియ్యం అక్రమ తరలింపును అడ్డుకుంటున్నారు. కేసులు నమోదు చేస్తే జరిమానా వేసి పౌరసరఫరాల అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో ఆదోని, ఆలూరు స్టాక్ పాయింట్లపై తమదైన శైలిలో విచారణ జరిపితే నిజాలు బయటకు వస్తాయని పలువురు అంటున్నారు.



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న బియ్యం

ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 26: ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 5,711 మంది హాజరయ్యారు. ఇందులో 2,327 మంది విద్యార్థులు పాసై 41 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే జనరల్ కోర్సులో 1,770 మందికి గానూ 733 మంది విద్యార్థులు పాసై 41.41 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీఆర్ జూనియర్ కళాశాలలో 16 మందికి గానూ ఆరుగురు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 168 మందికి గాను 49 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో 66 మందికి 45 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బీసీ రెసిడెన్షియల్ కళాశాలలో నలుగురిలో ఇద్దరు, ఇన్సెంటివ్ కళాశాలలో 19 మందికి నలుగురు, కేజీబీవీ కళాశాలలో 186 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 108 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో 465 మందికి గానూ 215 మంది పాసై 46.24 శాతం ఉత్తీర్ణత సాదించారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ కళాశాలలో 89 మందికి గానూ 38 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐవో గురువయ్యశెట్టి వెల్లడించారు.

ఇక మీ సేవలు చాలు

- వెళ్లిపోండని యూనివర్సిటీ వీసీలకు సీఎంవో మౌఖిక ఆదేశాలు?
- సెలవులో వెళ్లిపోయిన ఇద్దరు వీసీలు
- అలా వెళ్లారో లేదో రిజిస్ట్రార్‌ల సొంత నిర్ణయాలు
- అంతర్గత బదిలీలకు శ్రీకారం
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు

కర్నూలు(అర్బన్), జూన్ 26: ఇక చేసిన సేవలు చాలని, వెళ్లిపోండంటూ యూనివర్సిటీ వీసీలకు సీఎంవో మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. దేశానికి మెరికల్ లాంటి స్కాలర్స్‌ను అందించాల్సిన యూనివర్సిటీలు వీసీలు, కొందరు అధ్యాపకులు చేస్తున్న రాజకీయాల వల్ల అధికార పార్టీకి అడ్డాలుగా మారిపోయాయి. ఈ క్రమంలోనే యూనివర్సిటీల్లో ప్రస్తుతం ఉపకులపతులుగా పని చేస్తున్న వారందరూ విధుల నుంచి నిష్క్రమించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. గత ఐదేళ్లలో జిల్లాలోని మూడు యూనివర్సిటీల్లో ఉపకులపతులు, అధ్యాపకుల తీరు జిల్లాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. యూనివర్సిటీలను పర్యవేక్షించాల్సిన ఉన్న విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి ప్రతి పనికి ఓ రేటు పెట్టి వీసీలకు దండుకునేందుకు లైసెన్స్‌లు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయాన్ని విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేసింది.

● జిల్లాలోని క్లస్టర్, రాయలసీమ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలు ఉన్నాయి. బుధవారం క్లస్టర్ యూనివర్సిటీ వీసీ మినహా ఇతర రెండు యూనివర్సిటీలకు చెందిన ఉపకులపతులు లీవ్‌లో వెళ్లిపోయినట్టు సమాచారం. వీసీలు అలా సెలవులో వెళ్లిపోయారో లేదో అప్పుడే రిజిస్ట్రార్లు సొంత నిర్ణయాల దిశగా పాలనలో అడుగులు వేస్తున్నారు. ఇందులోభాగంగానే రాయలసీమ యూనివర్సిటీలో నాలుగో తరగతి ఉద్యోగులకు సంబంధించి రెక్టార్, రిజిస్ట్రార్‌లు అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేసి పాలన పరమైన అంశాలను చర్చించడం గమనార్హం. వర్శిటీలో మొదటి నుంచి పెత్తనం చెలాయిస్తున్న.. ఓ చిరుద్యోగి యూనివర్సిటీ పాలనలో బోధనేతర సిబ్బందిలో 30 మందికి సంబంధించి అంతర్గత బదిలీలకు శ్రీకారం చుట్టారని విద్యార్థి సంఘాలు మండి పడుతున్నాయి.



ఇసుక డంప్‌ను దోచేశారు..!

- 1600 టన్నులను స్వాహా చేసిన వైసీపీ నాయకులు
- సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు
- హౌసింగ్ అధికారుల ఫిర్యాదును పట్టించుకోని వైనం

కోసిగి, జూన్ 26: వైసీపీ నాయకులు ఏకంగా 1600 టన్నుల ఇసుకను దోచేశారు. ఇందుకు ఇద్దరు కానిస్టేబుళ్లు సహకరించినట్టు తెలుస్తోంది. హౌసింగ్ ఏఈ శేఖర్ వివరాల మేరకు.. స్థానికంగా సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీలో సుమారు 500 పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కార్యక్రమంలో భాగంగా సుమారు 1600 టన్నుల ఇసుకను జగనన్న కాలనీలో డంప్ చేశారు. అయితే స్థానిక వైసీపీ నాయకులు కోసిగి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్ల సహకారంతో దుర్గానగర్, 9వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో కింది సుంకులమ్మ గుడికి చెందిన సుమారు 8 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించుకుపోయారు. ఈ తరలింపు కార్యక్రమం ఐదు రోజులుగా సాగింది. ఇద్దరు కానిస్టేబుళ్లు ట్రాక్టర్ల యజమానులతో సన్నిహితంగా ఉంటూ ఇసుకను తోలే సమయంలో కాపలాగా ఉన్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇదే విషయం హౌసింగ్ అధికారుల దర్యాప్తులో తేలడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ తతంగానికి పోలీసులే సహకరించడంతో ఎక్కడ తమ విషయం బయటకు పొక్కుతుందోనని ఫిర్యాదు స్వీకరించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా ఈ ఇద్దరు కానిస్టేబుళ్లు అక్రమ ఇసుక తరలించే వైసీపీ నాయకులతో సన్నిహితంగా ఉంటూ నెల నెలా ఎడబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జగనన్న కాలనీలోని ఇసుకను అమ్మగా వచ్చిన లక్షలాది రూపాయలను పోలీసులు, ట్రాక్టర్ల యజమానుల చేతులు మారినట్లు సమాచారం. జిల్లా పోలీసు అధికారులు స్పందించి విచారించాలని హౌసింగ్ అధికారులు కోరుతున్నారు.



పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ



కోసిగిలో జగనన్న కాలనీలో నిల్వ చేసిన ఇసుక డంప్ (ఫైల్)

ఇష్టారాజ్యం

- విధుల్లో నిర్లక్ష్యంగా సచివాలయ ఉద్యోగి
- జిల్లా స్థాయి అధికారుల అండతో రెచ్చిపోతున్న వైనం

కోడుమూరు, జూన్ 26: కోడుమూరులో ఆయన ఓ చిరుద్యోగి. ఆయనకు జిల్లా స్థాయి అధికారుల అండదండలు ఉన్నాయి. దీంతో ఆయన ఏం చేసినా అడిగే వాళ్లే లేరు. డ్యూటీకి ఇష్టం రావడం లేదంటే ఎగనామం పెట్టడం. ఒక వేళ డ్యూటీకి వచ్చినా ఏ పని చేయకపోగా పక్కనే ఉన్న మరో ఆఫీసుకు వెళ్లి చేయించుకోండని ఉచిత సలహాలు ఇస్తున్నాడు. ఇదేమిటని మండల స్థాయి అధికారులు ప్రశ్నిస్తే వెంటనే జిల్లా స్థాయి అధికారుల నుంచి వారికి ఫోన్ వస్తుంది. 'అతను మావాడే.. మా కులమే.. మాకు బంధువు కూడా కాబట్టి మా వాడి జోలికి వెళ్లవద్దు' అంటూ కర్నూలు, నంద్యాల జిల్లాల ఉన్నతాధికారుల నుంచి మండల స్థాయి అధికారులకు ఫోన్లు వస్తాయి. ఆ ఉద్యోగి ఎవరో కాదు కోడుమూరు సచివాలయం-4 లో పని చేసే డిజిటల్ అసిస్టెంట్ రమేష్.



సచివాలయంలో 11 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు

విధులకు డుమ్మా

సచివాలయం-4లో పని చేసే డిజిటల్ అసిస్టెంట్ రమేష్ అంటే మండలంలో తెలియని ఉద్యోగి లేడు. ఇతనికి జిల్లా స్థాయి అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇతను ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇతను ఏ పొరపాటు చేసినా సమర్థించడానికి కర్నూలులో ఒక ఉన్నత స్థానంలో కూర్చున్న జిల్లా స్థాయి అధికారితోపాటు నంద్యాలలో జిల్లా స్థాయి అధికారి ఉండడంతో అతని ఎవరూ ఏమీ అనలేని పరిస్థితి. జిల్లా స్థాయి అధికారుల అండ ఉండటం వల్ల ఈ చిరుద్యోగి ఎప్పుడు పడితే అప్పుడు విధులకు డుమ్మా కొట్టడంతోపాటు సహ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నాడు. ఇతని వ్యవహారం గురించి సహ ఉద్యోగులు చాలా సందర్భాలు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా ప్రయోజనం లేదు. దీంతో చేసేదేమీ లేక సహ ఉద్యోగులు అతను ఏం చేసినా చూసీచూడనట్లు వెళ్లిపోతున్నారు.



కోడుమూరులోని సచివాలయం

అధికారుల తనిఖీలో వెలుగులోకి..

మండల పరిషత్ సూపరింటెండెంట్ క్రిష్టారెడ్డి, డీడీవో అజయ్‌భాస్కర్ కోడుమూరు సచివాలయం-4 తనిఖీ చేశారు. దీంతో మూడు రోజుల నుంచి రమేష్ విధులకు డుమ్మా కొట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. రిజిస్టర్‌లో మూడు రోజులగా రమేష్ సంతకాలు చేయకపోవడం, సెలవు కూడా తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సలీమ్‌ను నిలదీశారు. తమకు ఎలాంటి సమాచారం లేదని, విధులకు రావడం లేదని పంచాయతీ కార్యదర్శి సమాధానం ఇచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు కావడమే కాకుండా ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మెమో ఇస్తామని అన్నారు. శాఖాపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు. అయితే విధులకు హాజరుకాని రమేష్ సోమ, మంగళవారంలో సాయంత్రం 5.30 గంటలకు విధులకు హాజరైనట్లు తంబ్ వేయడం పట్ల అధికారులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఎక్కడో ఉండి కోడుమూరులో ఉన్నట్లు ఫేక్ లొకేషన్ యాప్ ద్వారా చేతి వేలు ముద్ర వేసి ఉంటాడా అనే విషయం అధికారుల విచారణలో తెలియాల్సి ఉంది.

పని వేళలు పాటించని సచివాలయం ఉద్యోగులు

కోడుమూరు మండలంలో 21 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో దాదాపు 164 మంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే సచివాలయం ఉద్యోగస్తులు సమయపాలన పాటించడం లేదు. బుధవారం సచివాలయం 4లో ఉదయం 11 గంటలైనా ఇంజనీర్ అసిస్టెంట్ మినహా మిగిలిన 6 మంది ఉద్యోగులు లేకపోవడం విమర్శలకు దారి తీసింది. మండలంలోని 21 సచివాలయాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అలాగే గూడూరు మండలంలో 14 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 100 మంది, సి. బెళగల్ మండలంలో16 సచివాలయాల్లో 150 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిన సచివాలయం ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మెప్మాపై అవినీతి మరకలు

సిబ్బంది చేతివాటంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

ఇటీవల సమీక్షలో ఆగ్రహించిన ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరు, జూన్ 26: పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)పై అవినీతి మరకలు అంటుకున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మెప్మా విభాగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లేవనెత్తిన పలు ప్రశ్నలకు మెప్మా సిబ్బంది, అధికారులు సమాధానం చెప్పలేక నీళ్ల నమిలారు. మెప్మా విభాగంలో 1900 పొదుపు గ్రూపులు ఉండగా దాదాపు 20వేల మంది సభ్యులు ఉన్నారు. 2023-24కు సంబంధించి బ్యాంకుల ద్వారా ఆయా గ్రూపులకు దాదాపు రూ.12.98 కోట్ల రుణాలు ఇప్పించారు. అంతేగాక పీఎం సమృద్ధి యోజన కింద పట్టణంలోని వివిధ చిరు వ్యాపారులకు రూ.10వేల చొప్పున 1900 మందికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రుణాలు మంజూరు చేయించారు. అలాగే సున్నా వడ్డీ రుణాల 1840 గ్రూపులకు రూ.3 కోట్లు వచ్చాయి. అలాగే ఆసరా పథకం కింద 1660 గ్రూపులకు రూ.39.72 కోట్లు వచ్చాయి. మెప్మా విభాగంలో ఇంత భారీ మొత్తంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పొదుపు గ్రూపులను ఏర్పాటు చేయడం, గ్రూపు సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం, కొత్తకొత్త వ్యాపారాలను ఏర్పాటు చేసేందుకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం దాదాపు 60 మంది ఆర్పీలు, ఐదు మంది సీవోలను నియమించింది. అయితే వీరు కొత్త గ్రూపుల ఏర్పాటు చేసే విషయంలోను, ఉన్న గ్రూపులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించే విషయంలోనూ తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణాలు ఇప్పించే సమయంలో బ్యాంకు అధికారులు, మెప్మా అధికారుల పేర్లు చెప్పి పొదుపు గ్రూపుల నుంచి కొంత మొత్తాన్ని దండుకుంటున్నట్లు సమాచారం. అంతేగాక పీఎం సమృద్ధి యోజన పథకం దరఖాస్తు చేసే విషయంలో తమకు ఇష్టం ఉన్న వారితో దరఖాస్తు చేయించి వారికి మాత్రమే రుణాలు అందేలా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. ఆర్పీల్లో కొంతమంది గ్రూపు సభ్యుల అవతారం ఎత్తడంతో పాటు బినామీ సభ్యులను ఏర్పాటు చేసుకొని బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా గతంలో వచ్చాయి. అంతేగాక తాము చెప్పిన మాట వినడం లేదని, కొంతమంది గ్రూపుల నుంచి లీడర్లపై ఒత్తిడి తీసుకురావడం, తొలగిస్తామని బెదిరించడం వంటివి సైతం జరిగినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే ఆగ్రహంతో వెలుగులోకి..

కొంతమంది కొన్నేళ్లుగా ఆర్పీలుగా కొనసాగుతుండడంతో గుత్తాధిపత్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అలాగే జగనన్న మార్ట్ ఏర్పాటు కోసం గతేడాది గ్రూపుల నుంచి దాదాపు రూ.19లక్షలు వసూలు చేసినప్పటికీ మార్ట్ ఏర్పాటుకు నోచుకోలేదు. ఈ విషయం కాస్తా ఇటీవల ఎమ్మెల్యే సమీక్షలో బయటపడింది. దీంతో ఎమ్మెల్యే ఎవరి దగ్గరి నుంచి అయితే డబ్బు వసూలు చేశారో వారికి తిరిగి చెల్లించాలని ఆదేశించారు. అయితే ఇప్పటికీ కొన్ని గ్రూపులకు సొమ్ము అందలేదంటే ఎమ్మెల్యే ఆదేశాలను ఎలా బేఖాతరు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అలాగే నిరాశ్రయుల కేంద్రం నిర్వహణపై కూడా అధికారులు, మెప్మా సిబ్బంది సరైన సమాధానం చెప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మెప్మాలో విధులు నిర్వహిస్తున్న పీవోతోపాటు సీవోలు గ్రూపుల నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడం, ఆర్పీల విధుల నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఎవరు ఏమిచేస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడిందని పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మెప్మా విభాగంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణవాసులు కోరుతున్నారు. మెప్మాలో జరుగుతున్న అక్రమాలపై స్థానిక పీవో జయవర్ధన్‌ను వివరణ కోరగా సభ్యులు ఫిర్యాదు చేస్తే విచారించి తొలగిస్తామన్నారు. జగనన్న మార్ట్‌కు వసూలు చేసిన మొత్తాన్ని ఇప్పటికే చాలా వరకు తిరిగి ఇచ్చామని చెప్పారు.. కొంతమందికి పంపిణీ సోమవారంలోపు పూర్తిచేస్తామని తెలిపారు.



పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న మెప్మా కార్యాలయం

యంత్ర సేవపై విచారణ

- అక్రమాలను వెలికి తీయాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు
- వైసీపీ నేతల్లో వణుకు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 26: గత వైసీపీ ప్రభుత్వం రైతుల కోసమంటూ దాదాపు రూ.2వేల కోట్లకు పైగా ఖర్చుతో అమలు చేసిన వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, వెంటనే విచారణ చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. దీంతో వైసీపీ నాయకులు, ఉన్నతాధికారుల్లో వణుకు మొదలైంది. కర్నూలు జిల్లాలో 466 యంత్రసేవా కేంద్రాల ద్వారా యంత్ర పరికరాలను 1,765 మంది రైతులకు అందించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. దీని కోసం రూ.16.26 కోట్లు ఖర్చు చేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో రూ.15.74 కోట్లతో 408 యంత్ర సేవా కేంద్రాల ద్వారా 2,065 మంది రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు, ఇతర వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ పథకం అమలు కోసం ఒక్కో యూనిట్‌కు రూ.15 నుంచి 25 లక్షలు ఖర్చు చేశారు. ప్రభుత్వం 40 శాతం మొత్తాన్ని రాయితీ రూపంలో ఇచ్చింది. మిగిలిన 60 శాతంలో పది శాతం రైతులు భరించాలని, మిగిలిన 50 శాతం మొత్తాన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రుణంగా ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. అయితే ఈ పథకం అమలులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు రూ.కోట్లల్లో ముడుపులు వైసీపీ నేతలకు అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని మీద బుధవారం మంత్రి అచ్చెన్నాయుడు విజయవాడలో వ్యవసాయ శాఖ రాష్ట్ర అధికారులతో సమావేశమై ఈ పథకం అమలులో జరిగిన అవకతవకలు, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు.

బాల కార్మికులపై స్పెషల్ డ్రైవ్



బాల కార్మికులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(లీగల్), జూన్ 26: నగరంలో పెరిగిపోతున్న బాల కార్మికులను తగ్గించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, జిల్లా లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబ శివ ఆధ్వర్యంలో వీధి బాలలను గుర్తించడానికి రెండు బృందాలను ఏర్పా టు చేశారు. ఈ రెండు బృందాలు నగరంలోని వివిధ ప్రాంతాలలో తనిఖీలు నిర్వ హించి ముగ్గురు బాలలను గుర్తించాయి. ఆ తర్వాత బాలల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో డీసీ పీవో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

మాదక ద్రవ్యాలు స్లోపాయిజన్ లాంటివని, వాటికి అలవాటు పడితే.. జీవితాలు నాశనమవుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు.. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రారంభంలో మాదక ద్రవ్యాలను తమాషాగా తీసుకుంటే ఆ తర్వాత అవి లేకుంటే బతకలేమన్నంతగా పరిస్థితి తయారవుతుందని అన్నారు. వీటికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ లీగల్ కౌన్సిల్ ఎస్.మనోహర్, గవర్నమెంటు నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి సహకరించాలి

5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు



జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మాట్లాడుతున్న ఆర్థిక సంఘం సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 26: ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్థానిక సంస్థల బలోపేతానికి సహకరించాలని 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు కోరారు. ఉమ్మడి జిల్లా పర్యటన పురస్కరించుకుని బుధవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా జిల్లా పంచాయతీ అధికారులు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీ, డివిజన్‌కు ముగ్గురు చొప్పున ఎంపికైన పంచాయతీ కార్యదర్శులు, ప్రతి మండలం నుంచి ఎంపికైన ఇద్దరు సర్పంచులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం సభ్యులు ఎం. ప్రసాదరావు, ఎంవిఎస్. పద్మారావు, కే. కృపారావు పాల్గొన్నారు. రానున్న కాలంలో స్థానిక సంస్థలను అభివృద్ధి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదించేందుకు సభ్యులు జిల్లాకు వచ్చారు. గ్రామ, మండలాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి తగిన సూచనలను జిల్లా పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, సర్పంచుల నుంచి సభ్యులు తీసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సెక్రటరీ డా.కేవీ. రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో ఆదాయ వనరులు ఏ విధంగా పెంచుకోవాలి, అనవసర ఖర్చులు ఎలా తగ్గించుకోవాలో నిర్దిష్టమైన నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. మధ్యాహ్నం నగర పాలక సంస్థకు సంబంధించి ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో కమిషనర్ ఏ. భార్గవతేజ అధ్యక్షతన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నుల వసూలు ఏ స్థాయిలో చేస్తున్నారని..వంద శాతం పూర్తి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో నివేదికలు ఇవ్వాలని సభ్యులు కమిషనర్‌ను కోరారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లా పంచాయతీ అధికారులు టీవీ నాగరాజనాయుడు, మంజుల, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఈఓఆర్డీలు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 26: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరినట్లు జిల్లా కోఆర్డినేటర్ ఐ.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ప్రవేశం కోరిన పాఠశాలలో పొందాలన్నారు. పూరించిన దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫొటోలు జతపరిచి ఈ నెల 28వ తేదీలోగా వారు ప్రవేశం కోరిన పాఠశాలలో సమర్పించాలన్నారు. రాత పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీలలో దరఖాస్తులు ప్రవేశం కోరిన పాఠశాలలో సమర్పించాలన్నారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రశ్నపత్రం గత తరగతికి చెందిన సిలబస్ ప్రకారం ఆబ్జెక్టివ్ విధానంలో 50 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాలకోసం సమీపంలోని గురుకులాల్లో సంప్రదించాలని సూచించారు.

కోసిగి కేజీబీవీని తనిఖీ చేసిన డీఈఓ

కోసిగి మండలంలోని కేజీబీవీని బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తనిఖీ చేశారు. మెనూ సక్రమంగా పాటించలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. అందుకు కారణమైన కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్, అకౌంటెంట్‌కు నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ తెలిపారు. మెనూ ప్రకారం భోజనం, రుచిగా, శుచిగా, శుభ్రంగా వడ్డించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు.

మోదీని సత్కరించిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



ప్రధాని మోదీని కలిసి ఎంపీ

కర్నూలు(అర్బన్), జూన్ 26: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఢిల్లీలో ఉన్న ఎంపీ నాగరాజు సహచర ఎంపీలతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి ప్రధాని మోదీని కలిశారు. ఈ సందర్భంగా కురువ సంప్రదాయ వస్త్రంతో తయారు చేసిన కండువాతో మోదీని సత్కరించారు.

రాష్ట్రపతి, ప్రధానిని కలిసిన బైరెడ్డి శబరి



రాష్ట్రపతిని కలిసిన నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి

కల్లూరు, జూన్ 26: నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కుటుంబ సభ్యులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ప్రసా దాలను అందజేశారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

బిడ్డను చంపుకున్న తల్లి

- ఆ తర్వాత గూడ్స్ రైలు కింద పడాలని యత్నం
- అడ్డుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు
- మతిస్థిమితం సరిగా లేకపోవడంతోనే...
- దేవరబెట్టలో విషాదం



విశ్వనాథ్ (ఫైల్)

కోసిగి, జూన్ 26: కోసిగి మండలంలోని దేవరబెట్ట గ్రామంలో హృదయ విదారక ఘటన జరిగింది. మతిస్థిమితం లేని ఓ తల్లి పది నెలల కొడుకు గొంతు నులిమి చంపి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించింది. ఈ ఘటన బుధవారం తుంగభద్ర పాత రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన కొండ రామాంజనేయులుకు, తుమ్మిగనూరు గ్రామానికి చెందిన హనుమంతమ్మకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొన్ని నెలలుగా హనుమంతమ్మ మానసిక స్థితి సరిగా లేదు. భర్త రామాంజనేయులుతో గొడవపడి పుట్టినిల్లయిన తుమ్మిగనూరు వెళ్లింది. బుధవారం సాయంత్రం తన పది నెలల కుమారుడు విశ్వనాథ్‌ను ఎత్తుకుని తుంగభద్ర పాత రైల్వేస్టేషన్ సమీపంలోకి వెళ్లి చిన్నారి గొంతు నులిమి చంపేసింది. ఆ తర్వాత ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోడానికి వెళ్లింది. సరిగ్గా ఆ సమయానికి హనుమంతమ్మను వెతుక్కుంటూ అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను అడ్డుకున్నారు. అయితే.. తల్లి చంకలో విగతజీవిగా ఉన్న విశ్వనాథ్‌ను చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మానసికస్థితి లేక కన్న తల్లి చేజేతులా బిడ్డను దూరం చేసుకున్న విషాదంలో దేవరబెట్ట గ్రామం మునిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయలేదు.

రైతు వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్

కల్లూరు, జూన్ 26: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రుసుం చెల్లించిన 8532 వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ పనులు పూర్తి చేయనున్నట్లు ఆ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 25-6-2024 వరకు రుసుం చెల్లించిన వారికి విద్యుత్ పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ కారణంగా కొత్తగా వ్యవసాయ కనెక్షన్‌లకు అప్లై చేసుకున్న రైతులకు డిమాండ్ నోటీసులు, శాంక్షన్ పత్రాలు ఆపి ఉన్నారు. కోడ్ పూరైన మేరకు వెంటనే వీటిని తక్షణమే శాంక్షన్ చేసి డిమాండ్ నోటీసులు పంపమని ఆదేశాలు వచ్చాయని ఎస్ఈ ఉమాపతి తెలిపారు.

మత్తు పదార్థాల జోలికి వెళితే చర్యలు



అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

కర్నూలు, జూన్ 26: గంజాయి తదితర మత్తు పదార్థాలు అక్రమ రవాణా, విక్రయాల జోలికి వెళితే చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ నాగరాజు హెచ్చరించారు. బుధవారం ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా యాంటి డ్రగ్స్ డే పురస్కరించుకుని ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక కంట్రోల్ రూమ్, ఎగ్జిబిషన్ గ్రౌండు నుంచి ర్యాలీ ప్రారంభమై కొండారెడ్డి బురుజు వరకు సాగింది. అక్కడ మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు బుగ్గి పాలు చేసుకోకుండా మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సూపరింటెండెంట్ రవి కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, డీఎస్పీ విజయశేఖర్, సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, ట్రాఫిక్ సీఐ గౌతమి, ఒకటో పట్టణ సీఐ పవన్ కుమార్, తాలుకా సీఐ శ్రీధర్, సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జవాజీ దాసు మృతదేహం

మహానంది, జూన్ 26: మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్‌కు చెందిన జవాజీ దాసు(62) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. . గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన రైల్వే గేటు వద్దకు నడిచి వస్తున్న దాసును గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే దాసు మృతి చెందాడు. మహానంది పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

చాగలమర్రి, జూన్ 26: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ రమణయ్య బుధవారం తెలిపారు. బాలిక ఈనెల 25వ తేదీ ఉదయం ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయిందని, తిరిగి ఇంటికి రాలేదని, ఈ మేరకు తండ్రి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు, జరిమానా

కర్నూలు(లీగల్), జూన్ 26: అప్పు తీసుకొని, బదులుగా చెల్లని చెక్కు ఇచ్చిన ఒక ఆర్ఎంపీ డాక్టర్‌కు ఏడాది జైలు, రూ.3.50 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ టి. జ్యోత్స్నా దేవి బుధవారం తీర్పు చెప్పారు. కర్నూలు చెందిన ఫిర్యాది ఎస్. గోకారి బాషా నుంచి గద్వాల జిల్లా ఉండవల్లికి చెందిన ఒక ఆర్ఎంపీ డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా 2018లో తన ఇంటి అవసరాల కోసం రూ.2.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత రూ.1.75 లక్షలకు తన బ్యాంకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకు ద్వారా వసూలుకు పంపగా.. ఖాతాలో తగిన నిల్వలు లేకపోవడంతో అది బౌన్స్ అయింది. దీంతో ఫిర్యాది కోర్టులో కేసు దాఖలు చేశాడు. నిందితునిపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

గూడూరు, జూన్ 26: గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బుధవారం గూడూరు మండలం కె. నాగలాపురం సమీపంలో జింకను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జింక మృతి చెందింది. ఫారెస్ట్ అధికారులకు మృతి చెందిన జింకను అప్పగించినట్లు కె.నాగలాపురం పోలీసులు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

మిడుతూరు, జూన్ 26: మిడుతూరు మండలంలోని పీరు సాహేబ్ పేట గ్రామంలో మంగళవారం జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. వెంకట రమణ, మధుకుమార్, మధు గోపాల్, శివ మధు, మధు కృష్ణ, రామకృష్ణ అనే వ్యక్తులు పాత కక్షలు మనసులో పెట్టుకుని మంగళవారం సాయంత్రం పీరుసాహెబ్ పేట గ్రామంలో నరసమ్మ, రవణమ్మ, శివ, వడ్డె లక్ష్మీ నారాయణ, ఆంజనేయులుపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన రవణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ జగన్ మోహన్ ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

PLOT FOR SALE

R.R. రియల్ ఎస్టేట్ కర్నూలు-జీన్ రోడ్డు దూపాడు రిడ్జ్ స్కూల్ దగ్గర (30x50) (30x40) సైజులు గల Open ప్లాట్స్ మరియు బళ్లారి చౌరస్తా దగ్గర 3 (BHK) ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. సంప్ర: **91828 21014.**
AJL-186377

CHANGE OF NAME

I, **AMTUL ALEEM** (Old Name) R/o.H.No: 41-254, Kotha Peta, Kurnool dist, AP., have changed my name as **AMTUL ALEEM SHAHUL HAMID** (New Name) W/o.SHAHUL HAMID
AJL-186289

CHANGE OF NAME

I, **MOHAMMED ARSHAD** S/o.ABDUL WAHEED (Old Name) R/o.H.No:32-227-A, Gadda, Kurnool dist, AP., have changed my name as **SHAIK MOHAMMED ARSHAD** (New Name) S/o.ABDUL WAHEED
AJL-186289

CHANGE OF NAME

I, **Khande Ravi Theja** S/o.Khande Harinath (Old Name) R/o:25-396G2, Priyanka Nagar, Nandyal dist, AP., Here by State That I Have Changed My Name **known as Khande Ravi Teja** S/o.Khande Harinath (New Name)
AJL-186289

CHANGE OF NAME

I, **Kotha Lakshmi Deepthi** W/o.Khande Ravi Theja (Old Name) R/o:25-396G2, Priyanka Nagar, Nandyal dist, AP., Here by State That I Have Changed My Name known as **Khande Lakshmi Deepthi** W/o.Khande Ravi teja (New Name)
AJL-186289

PASSPORT MISSING

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నేను **Munaganuri Siva Ganesh Kumar S/o M.S.Panduranga Rao,** నా పాస్‌పోర్ట్ నెంబర్. **G3225075.** జారీచేసిన తేది **03.05.2007** పోగొట్టుకొని పోయినది. కర్నూలు మండలంలోని కర్నూలు పట్టణం నందు కలెక్టరు ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఆటోలో పోయినది. కావున పై పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికినచో క్రింద అడ్రసుకు ఇవ్వగలరు. వారికి తగిన పారితోషికం ఇస్తాము. ఇంటి నెం.50-184-డి, అరోరా నగర్, బి-క్యాంప్, కర్నూలు, ఆంధ్రప్రదేశ్-518002. సెల్ నెంబర్: **91333 02173**
AJL-186223

PASSPORT MISSING

I, **KATTUBADI SHAFI BASHA** S/o.KATTUBADI HUSSAIN SAHEB, R/o.H.No:45-24-180-2, Ashok Nagar, kurnool dist, AP., have lost my Indian original passport bearing **No: M728626,** has been lost by me while kurnool over flowed water of tungabhadra River and Handri River during the floods on 02-10-2009 that my house was submerged in the floods and drifted my passport. if found by anyone please inform to the above address.
AJL-186289

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: **7382114647**
AJA-189265

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



గౌరు దంపతులకు సన్మానం



గౌరు దంపతులను సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

కల్లూరు, జూన్ 26: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలను గడివేముల మండల అంగన్‌వాడీ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గౌరు దంపతులకు పూల బోకేలు అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు, సూపర్‌వైజర్లు గడివేముల మండల టీడీపీ అధ్యక్షుడు దేశం సత్యనా రాయణరెడ్డి ప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సాహు మహారాజు జయంతి



సాహూ మహారాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 26: స్థానిక బీసీ భవనంలో బుధవారం ఛత్రపతి సాహూ మహారాజు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా బీసీ ఫెడరేషన్ కన్వీనర్లు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ భారతదేశంలో మొదటిసారిగా రిజర్వేషన్లు ప్రవేశపెట్టి 1918లోనే పట్వారి వ్యవస్థను రద్దు చేసిన అభ్యు దయ వాది సాహూ మహారాజ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు జీవీ కృష్ణయ్య, చంద్రకళాబాయి వర్మ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 26: ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ఏజీఎం మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ఎంపీసీ విభాగంలో ఎం.సాయిలిఖిత 470/467 మార్కులు, ఏ.నందిని 467, పవన్ కుమార్ 466, కేడీ ధరహాసన్ 464 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో ఎస్.ఎన్ హర్షిత 440/436 మార్కులు, మంజులత 436, కే.ప్రేమ్ కుమార్ 435, పూజిత 435 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థు లను, తల్లిదండ్రులనలు, అధ్యాపకులను కళాశాల డీన్స్ బాలాజీ, సరళ అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన రవీంద్ర విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 26: ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాల్లో రవీంద్ర, శ్రీకృష్ణ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో కే రాజేశ్వరి 467, ఎన్. చరిత 464, షేక్ రుక్సానాబీ 463, బి.శివమనీషా 463, అలాగే బైపీసీ విభాగంలో బి.ఉషారాణి 435, బి.వెన్నెల 432, ఆర్షియా సుల్తానా 431, కె.శిరీష 431 మార్కులు సాధించారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, కళాశాల సమన్వ యకర్త సురేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి అభినందించారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 26: కాకినాడలో జూలై 8, 9, 10 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న, కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవనంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలు విడు దల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు రాజకీయాలపైనా అవగాహన పెంచుకోవాలన్నారు. నూతనంగా ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను రక్షించాలి

కల్లూరు, జూన్ 26: జిల్లాలో వక్ఫ్ భూములను రక్షించాలని 524 కాలనీ పరిరక్షణ కమిటీ నాయకులు మైనారిటీ శాఖ మంత్రికి వినతులు సమర్పించారు. కల్లూరు ఎస్టేట్‌లోని సర్వే నెంబర్ 524పై కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 524 కాలనీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తీర్మానం చేస్తూ మైనారిటీ శాఖ మంత్రి, కలెక్టర్, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారికి రిజిస్టర్ పోస్టుల ద్వారా వినతిపత్రాలు పంపారు. ఇందులో చంద్రశేఖర్, హరిచంద్రారెడ్డి, ఖాసీంవలి, మహేష్, బ్రహ్మం, రాముడు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 25: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. బుధవారం స్థానిక బాష్యం పాఠశాలలో కరాటే క్రీడా కారులకు ఆయన బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాష్యం పాఠశాల జోనల్ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ప్రిన్సిపల్ శ్రావణ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు మాధవీజ్, సీనియర్ కరాటే శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పత్తి పంటపై అవగాహన

సి.బెళగల్, జూన్ 26: మండలంలోని బ్రాహ్మణదొడ్డి, ముడుమాల, పోలకల్లు గ్రామాలలో రైతులు సాగు చేసిన పత్తి పంటపై రైతులకు మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటకు పచ్చదోమ, ఆకుముడత వంటి తెగులుతో మొక్కదశలోనే పంట ఎదుగుదల లేకుండా చేస్తుందన్నారు. రైతులు వాటి నివారించడానికి క్లోరీపైరిఫాస్, అసేపేట్‌ను కలిపి పిచికారి చేయాలన్నారు. ఎంఈవోలు వెంకటేశ్వర్లు, సిద్దు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సి.బెళగల్, జూన్ 26: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఈవోఆర్డీ సందీప్ సంధీప్ అన్నారు. బుధవారం మండలంలోని ముడు మాల, పోలకల్లు, ఈర్లదిన్నె గ్రామాలలో తాగునీటి ట్యాంక్‌లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఈవోఆర్డీ మా ట్లాడుతూ గ్రామాల్లోని సర్పంచుల, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తాగునీటి ట్యాంక్‌లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

జిల్లా కోర్టులో ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(లీగల్), జూన్ 26: కర్నూలు బార్ అసోసియేషన్, స్థానిక ఓమినీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులకు స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. సుమారు 200 మంది న్యాయవాదులు, గుమాస్తాలకు ఉచితంగా వైద్యప రీక్షలు నిర్వహించినట్లు ఓమినీ హాస్పిటల్ డాక్టర్ ఇందు ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి రోజు నడక, వ్యాయామంతో తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, డా.శశిరాం, సీనియర్ న్యాయవాదులు సుమన, ప్రదీప్‌కుమార్, డా.సందీప్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ బి.రమేష్‌బాబు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 26: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ బి.రమేష్‌బాబు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య నిరోధక దినోత్సవం సందర్భంగా కర్నూలు ఎఫ్‌ఎం రేడియోలో బుధవారం మానసిక వ్యాధుల వైద్యనిపుణుడు డాక్టర్ బి.రమేష్‌బాబు చర్చా గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం వల్ల ఊపిరితిత్తులు, హృద్రోగ పక్షవాతం తదితర సమస్యలు వస్తాయన్నారు. మాదక ద్రవ్యాలను ఒక్కసారి అలవాటు చేసుకుంటే అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందన్నారు.



కర్నూలు ఎఫ్‌ఎం రేడియోలో చర్చా గోష్ఠిలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. నంద్యాల చెకోపోస్టులోని శ్రీహరి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, యువజన సర్వీసుల శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం, వాటి అనర్థాలు, మహిళలు, బాలికల అక్రమ రవాణా ఈవ్ టీజింగ్ అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈవో పీవీ రమణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సునీత, సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

రైతుబజారులో చౌకధరలు అమలు చేయండి

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశాలు



సీ క్యాంపు రైతుబజారులో తనిఖీ చేస్తున్న జేసీ

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 26: రైతుబజారులో చౌకధరలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతుబజారును తనిఖీ చేశారు. నోటీసు బోర్డులో నమోదు చేసిన ధరలకు వ్యాపారులు, పొదుపు గ్రూపు మహిళలు, రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారో లేదోనని ఆమె పరిశీలించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను తప్పకుండా పరిశీలించి వారికి న్యాయం చేయాలని సూచించారు. ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ వెంట మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు చిన్నస్వామి, గోపాల్, హనుమంతు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీరు



బిందెలో నీటి నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 26: నగర ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే తమ ధ్యేయమని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ అన్నారు. బుధవారం నగరంలోని పూలబజార్, స్వామిరెడ్డి నగర్, లక్ష్మీనగర్, శరీన్‌నగర్ ప్రాంతాలలో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తాగునీటిలో క్లోరిన్‌ను కమిషనర్ పరీక్షించారు. నీటి నాణ్యతలను ప్రతిరోజు పరీక్షించాలని, సరఫరాలో కలుషితానికి అస్కారం లేకుండ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం చిన్న మార్కెట్, కాలికమ్మ గుడి, చిన్న అమ్మ వారిశాల తదితర ప్రాంతాలలో పారిశుధ్య, పూడికతీత పనులను కమిషనర్ తనిఖీ చేశారు. అక్కడే స్థానికులతో మాట్లాడి శానిటేషన్ పనులపై ఆరా తీశారు. ఎక్కడైనా చెత్తకుప్పలు ఉంటే తక్షణమే తొల గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు సమన్వ యంతో పని చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈలు శేషసాయి, షాకీర్, డీఈఈలు రవిప్రకాష్‌నాయుడు, నరేష్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఇన్స్‌పెక్టర్లు రమేష్, జిలాని ఉన్నారు.

ఆర్.ఖానాపురానికి బస్సు సర్వీసును నడపాలి



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 26: గూడూరు మండలం ఆర్ ఖానాపురం గ్రామానికి బస్సు సర్వీసును నడపాలని మండల తెలుగు యువత అధ్య క్షుడు సుమన్ బాబు, ఆర్ ఖానాపురం సర్పంచ్ మునిస్వామి కోరారు. బుధవారం మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, ఆర్ ఖానాపురం సర్పంచ్ మునిస్వామి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మన్యం కొండ, కృష్ణ, ఎల్లప్పతో పాటు గ్రామస్థులు కర్నూలులో ఆర్టీసీ అధికా రులను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ ఖానాపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సర్వీసు నడపక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కోడుమూరు, జూన్ 26: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోడుమూరు తాలుకా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్నిక నిర్వహించారు. తాలుకా అధ్యక్షుడిగా మండల ప్రజా పరిషత్‌లో ఏవోగా పని చేస్తున్న క్రిష్టారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సి.బెళగల్ జడ్పీహైస్కూల్లో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న మహమ్మద్ రఫీక్, ప్రధాన కార్యదర్శిగా కోడుమూరు బాలుర హైస్కూల్లో ల్యాబ్ అసిస్టెంట్ క్రిష్ణమోహన్, కోశాధికారిగా మహబూబ్‌బాషా, సహాయ కార్య దర్శిగా మంజుల, డిస్ట్రిక్ కౌన్సిల్ మెంబర్లుగా జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో ఆప్షన్ మెంబర్లుగా ఐజయ్య, అరవిందలు ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఎన్నికల అధికారిగా మండల ఇంజనీర్ గంగరాజు వ్యవహరించారు.

నేడు దేశభక్తిపై కళా ప్రదర్శనలు

కర్నూలు(కల్చరల్), జూన్ 26: దక్షిణ ఆంధ్రప్రదేశ్ సంభాగ్ సమితి సంస్థ ఆధ్వర్యంలో దేశ సాంస్కృతిక వికాసం, దేశభక్తిని ప్రబోధించే కళా ప్రదర్శనలు గురువారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్‌కుమార్, సుకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, విశిష్ట అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరవుతారని తెలిపారు. 'ఏ కల్ అభియాన్...ఏ కల్ గ్రామ సంఘటన్' పేరుతో నిర్వహించే ఈ కళాప్రదర్శనల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కళా కారులు ఆయా ప్రాంతాలకు చెందిన గ్రామీణ సాంస్కృతిక అంశాలు, జాన పద నృత్యాలు, దేశభక్తిని చాటిచెప్పే గీతాలతో బృంద నృత్యాలు చేస్తారని తెలిపారు.

ఎస్ఐ అండతో వైసీపీ నాయకుల ఇసుక దందా



చింతమానుపల్లెలో డంపు చేసిన ఇసుక

సి.బెళగల్, జూన్ 26: ఎస్ఐ అండదండలతో వైసీపీ నాయకుల ఇసుక దందా ముమ్మరంగా నడుస్తున్నదని సి బెళగల్ మండలంలోని చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి, సి బెళగల్ గ్రామాల్లోని ట్రాక్టర్ యజమానులు బుధవారం ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ సి బెళగల్ మండలంలో పనిచేస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి, నలుగురు పోలీసులు కలిసి వైసీపీ నాయకులతో చింతమానుపల్లె దగ్గర ఇసుక డంపు చేసి పెద్ద లారీలకు ఇక్కడ నుంచే లోడు చేసి ఇసుకను బయటకు తరలిస్తున్నారని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సి బెళగల్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ట్రాక్టర్ల యజమానులు కోరారు.

రక్త పరీక్షల కోసం బారులు

సీబీపీ కేంద్రాలు పెంచాలంటున్న రోగులు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 26: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు రక్త పరీక్షల కోసం బారులు దీరారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) పరీక్షల కోసం ఉదయం నుంచి క్యూలైన్లలో నిలబడలేక అవస్థలు పడుతు న్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట అయినా సీబీపీ పరీక్షల కోసం రద్దీ తగ్గడం లేదు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా సీబీపీ కౌంటర్లు ఉన్న అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గంటల తరబడి నిల్చోవాల్సి వస్తుంది. కొందరు క్యూలైన్లలో నిలబడలేక కింద కూర్చుంటున్నారు. న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో సీబీపీ పరీక్షకు నాలుగు యంత్రాలు ఏర్పాటు చేసిన రోగులు రద్దీ తగ్గడం లేదు. తక్షణమే వీటి సంఖ్యను పెంచాలంటూ రోగులు కోరు తున్నారు.



రక్తపరీక్షల కోసం క్యూలో నిలబడిన రోగులు



చేతితో ఓపీ రాసి ఇస్తున్న సిబ్బంది

ఓపీ కోసం అవస్థలు: ప్రభుత్వ సర్వజన వైద్యశాలకి వచ్చే ఓపీ రోగులకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓపీ కేంద్రాల్లో నెట్ పని చేయకపోవడంతో ఓపీ టికెట్లు కోసం రోగులు నిరీక్షించారు. రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు ఓపీ కౌంటర్లు అధికారులు ఏర్పాటు చేసిన సాంకేతిక కారణాలతో తరచూ ఓపీకి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దాదాపు అరగంట తర్వాత నెట్ రావడంతో రోగులకు ఓపీ అడ్మిషన్లు ఇవ్వడం ప్రారంభించారు. ఆసుపత్రిలో సీఎస్ఆర్ఎంవో, ఏఆర్ఎంవో, ఆర్ఎంవోలు హాస్పిటల్స్ అడ్మినిస్ట్రేటర్స్ ఉన్నా తరచూ ఓపీ కేంద్రాల్లో సమస్య పరిష్కారం కావడం లేదు.

పథకాలను పునరుద్ధరించాలి: కాంగ్రెస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 26: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ అనంత రత్నం మాదిగ కోరారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 27 సంక్షేమ పథకాలను గత సీఎం జగన్మోహన్‌రెడ్డి రద్దు చేశారని వాటిని తెలుగుదేశం ప్రభుత్వం పునరుద్ధరిం చాలని కోరారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు లాజరస్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 130 హామీలిచ్చి ఒక్కటి అమలు చేయలేదని మండి పడ్డారు. ఈ సమావేశంలో ఎస్సీ బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, ఎజాజ్ అహ్మద్, జాన్, సదానందరం పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడమే లక్ష్యంగా పని చేద్దాం



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ గవర్నర్

కర్నూలు(అర్బన్), జూన్ 26: పేదలకు సాయం చేయడమే లక్ష్యంగా పని చేద్దామని లయన్స్ గవర్నర్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం నగరంలోని ఐఎంఏ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఆధ్వర్యంలో నాలుగో జిల్లా క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. పేదవారికి సాయం అందించే సేవలపై తీర్మాణం చేశారు. నెల్లూరులో వరదలతో నష్టపోయిన వారికి వెయ్యి డాలర్లు ఇచ్చి ఆదుకోవడానికి కృషి చేసిన లయన్స్ ఇంట ర్నేషనల్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ బాల మద్దయ్య, నాగేశ్వరరావు, దుర్గా నాగేశ్వరరావు, చిన్నపరెడ్డి, రమేష్‌నాథ్‌రెడ్డి, మాణిక్య ప్రభ, గోపాలక్రిష్ణ, రత్నప్రసాద్, శ్రీనివాసబోస్, విరుపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

బయోచార్‌తో అద్భుత ఫలితాలు: డీపీడీ

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 26: ప్రకృతి వ్యవసాయంలో రైతులకు బయోచార్ వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని మద్దూరునగర్‌లో ప్రకృతి వ్యవసాయ సమావేశం హాలులో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అధ్యక్షతన బయోచార్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, కన్సల్టెంట్ లక్ష్మయ్య, ఆత్మ ఏఏవో మధుమతి, డీపీఎం చక్రవర్తి పాల్గొన్నారు. బయోఛార్ వాడకం వల్ల నేల భౌతిక, రసాయన జీవ సంబంధమైన లక్షణాలు పెరుగుతాయని, నేల సారం తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. నేలలో సూక్ష్మ జీవుల వైవిధ్యాన్ని పెంచడం ద్వారా సేంద్రీయ కర్బనం పెరిగి మొక్కకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ స్థూల పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పండిత్ కుమార్, ఎంఎంటీఎల్ వంశీ, సిబ్బంది మల్లికార్జున, అబ్దుల్ బాసీద్, భుజేశ్వరుడు, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా తిరిగిరండి

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 25: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 14వ సీనియర్ మెన్ అంతర్ జిల్లా పోటీలలో పాల్గొనే కర్నూలు జిల్లా జట్టుకు టీషర్టులును జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టు విజేతలుగా రావాలని ఆకాంక్షించారు. కర్నూలు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 27 నుంచి 30 వరకు ధర్మవరంలో జరిగే హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా చాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్ మహేష్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, ఫిజికల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, యోగా మాస్టర్ రాఘవేంద్ర క్రీడాకారులు పాల్గొన్నారు.

హైర్ బస్ డ్రైవర్లకు వేతనాలు పెంచాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు



మాట్లాడుతున్న అంజిబాబు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 26: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే హైర్ బస్ డ్రైవర్లకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైర్‌బస్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు యు.శ్రీనివాసులు అధ్యక్షతన కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం అమలుతో 30 నుంచి 40 శాతం ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. దీని వల్ల డ్రైవర్‌కు అదనపు భారంతో ఎక్కువ సమయం పనిచేయాల్సి వస్తుందన్నారు. ఆర్టీసీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్న ట్లు ప్రభుత్వం ప్రకటన చేసిందని ఆయన గుర్తు చేశారు. కార్మికులతోపాటు డ్రైవర్లకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో శ్రీనివాసులు, సుబ్బయ్యగౌడు, శేఖర్, చెన్నకేశవులు, సాయిబాబా పాల్గొన్నారు.

పతకాలు సాధించడం హర్షణీయం



క్రీడాకారులతో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 25: స్కేటింగ్ క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర స్థాయి జోనల్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించడం జిల్లాకే గర్వకారణమని మాజీ మంత్రి, జిల్లా ఒలంపిక్ సంఘం చైర్మన్ కేఈ ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లా స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్కేటింగ్ రింక్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ 23 సంవత్సరాల క్రితం స్కేటింగ్ రింక్ కర్నూలులో ఏర్పాటయిందని గుర్తు చేశారు. అనంతరం జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు జగదీష్ కుమార్ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమ శిక్షణ అంకిత భావంతో ప్రతి రోజు సాధన చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు పి.విజయ్ కుమార్, జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా స్కేటింగ్ సంఘం అధ్యక్షుడు ఎస్. సుధాకర్‌బాబు, స్కేటింగ్ ఉపాధ్యక్షుడు పి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

1 నుంచి స్టాప్ డయేరియాపై అవగాహన



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), జూన్ 26: జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా నివారణ కోసం స్టాప్ డయేరియా అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డా.వై. ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన ఈ. తాండ్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని రేమట, ఉల్చాల గ్రామాల్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ మార్పులతో వర్షాకాలం మొదలై నీటి కాలుష్యం వల్ల డీహైడ్రేషన్‌కు గురి కాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. వైద్యాధికారి డా.విజయ మాధురి ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అందని వేతనం బతుకు భారం

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- రెండునెలలుగా అందని ఉపాధి వేతనాలు
- దాదాపు రూ.100 బకాయి ● పూటగడవక కూలీల ఇబ్బందులు



చిత్రంలో కనిపిస్తున్న కూలీ పేరు. భూలక్ష్మి. బాపురం గ్రామం. హాలహర్వి మండలం. ఈమెది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గానీ డొక్కాడని జీవితం ఈమెపై నలుగురు కుటుంబ సభ్యులు ఆధారపడ్డారు. రెండు నెలలుగా ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్తోంది. ఈమెకు రూ.12వేలు కూలీ డబ్బు రావాల్సి ఉంది. కానీ, పైసా రాలేదు. మండలంలో రూ. 2కోట్లు బకాయిలు రావాలి. ఈమెదే కాదు జిల్లాలో 4లక్షల కూలీలు పరిస్థితి ఇది.

పని వద్ద అధికారులను నిలదీస్తున్న కూలీలు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు ప్రతి వారం కూలి డబ్బు చెల్లించాలి. ఒకవేళ అలస్యమైనా గరిష్ఠంగా 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించాలి. ఆ తర్వాత చెల్లిస్తే వడ్డీతో సహా జమచేయాలని చట్టం చెబుతోంది. కానీ, పనులు చేసి నెలలు గడుస్తోన్నా వేతనాలు అందకపోవడంతో కూలీలు తల్లడిల్లుతున్నా పట్టించుకునేవారే లేకపోవడం గమనార్హం. కార్యాలయాల చుట్టూ కన్నీరు పెడుతూ తిరుగుతున్నా చలనం లేకపోవడం శోచనీయం.

హాలహర్వి, జూన్ 26: కరువు కోరల్లో చిక్కుకుని నలిగిపోతున్న కూలీల్లో ఆకలి మంటలు చెలరేగుతున్నాయి. వలసలు నివారించేందుకు ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకంలో నిధులు కొరత ఏర్పడింది. దాదాపు ఏడు వారాల నుంచి కూలీలకు వేతనాలు అందలేదు. ఆకలి మంటలతో విలవిలలాడిపోతున్నారు. దాదాపు రూ.100 కోట్లు బకాయిలు మిగిలిపోవడంతో కూలీలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో 28 మండలాల్లో 479 పంచాయతీలు ఉన్నాయి. 2.53లక్షల జాబ్ కార్డులున్నాయి. 4 లక్షల మందికి పైగా ఉపాధి హామీ పథకం కింద కూలీలు పని చేస్తున్నారు. ఈసారి కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాలుగా గుర్తించారు. కరువు జిల్లాలో పనులు లేవని సుగ్గిబాట పట్టిన కూలీలకు ఉపాధి భరోసా అన్నారు. ఉన్న ఊర్లో పనులు కల్పిస్తామని అధికారులు చెప్పిన మాటలు నమ్మి పనులకు వెళ్తే సకాలంలో కూలీలు చెల్లించడంలో అధికారులు విఫలమైయ్యారు. కూలీల కోసం అధికారులను నిలదీస్తూన్నారు. రెండు నెలలుగా అందని వేతనాలు కోసం విలవిలలాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● వెంటనే వేతనాలు అందించాలి

రోజువారి కూలీల వేతనాలతో జీవనం కొనసాగించే గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే కూలీలకు వేతనాలు బ్యాంకు ఖాతలో జమ చెయాలి. లేకపోతే ఆందోళన చేస్తాం.

\- గాదిలింగప్ప. గూళ్యం.

● త్వరలో కూలీలకు వేతనాలు అందిస్తాం

జిల్లాలో ఉపాధి కూలీలు బకాయిలు వాస్తావమే. త్వరలో కూలీలా ఖాతలో జమచేసేందుకు చర్యలు తీసుకుంటాం. అందరికి వేతనాలు అందేలా చూస్తాం. కూలీలు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

\- అమర్నాథ్ రెడ్డి, డ్వామా, పీడీ, కర్నూలు

బీజేపీలోకి వైసీపీ జిల్లా కార్యదర్శి మధు



పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, జూన్ 26: ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆధ్వర్యంలో వైసీపీ జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదన్ శర్మ తన అనుచరులతో కలిసి బుధవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ పార్థసారథి పనితీరును మెచ్చి, అభివృద్ధిలో ఆయనకు అండగా నిలవాలని బీజేపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. 37వ వార్డుకు వైసీపీ కౌన్సిలర్‌గా ఉన్న తన భార్య కూడా త్వరలో బీజేపీలో చేరుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, జూన్26: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ ఫీజులు, డొనేషన్లు అక్రమంగా విద్యార్థులనుంచి వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు నరసన్న, ఖాజా, సురేంద్ర, రఘు, విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో విద్యాశాఖ అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని సమావేశాన్ని అడ్డుకొని ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్‌లకు వినతిపత్రం ఇచ్చారు.

బాలిక అదృశ్యం

పత్తికొండ,జూన్26: పత్తికొండలో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. పట్టణానికి చెందిన బాలిక స్థానికంగా ఓ పాఠశాలలో చదువుతోంది. ట్యూషన్ టీచర్ రాఘవేంద్రపై తమకు అనుమానం ఉన్నట్లు బాలిక తల్లిదండ్రులు పోలీస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై కేసు నమోదుచేసి బాలిక ఆచూకిని తెలుసుకునేదిశగా ముందుకుసాగుతున్నట్లు సీఐ తెలిపారు.

పశువుల సంతలో తాగునీరు కరువు

ఆలూరు, జూన్ 26: ఆలూరు మార్కెట్ యార్డులో ప్రతి బుధవారం నిర్వహించే పశువుల సంతలో కనీసం రైతులకు మార్కెట్ యార్డు అధికారులు తాగు నీరు వసతి కల్పించలేదు. వివిధ ప్రాంతాల నుంచి పశువులు కొనుగోలు చేసేందుకు, విక్రయించేందుకు పెద్ద ఎత్తున తరలి వస్తారు. తాగు నీటి కోసం ఎలాంటి సౌకర్యం కల్పించకపోవడంతో అక్కడే ఉన్న హోటల్‌లో దాహం తీర్చుకున్నారు. అధికారులకు ఆదాయంపై ఉన్న ఆసక్తి తమ ఇబ్బందులపై లేదని రైతులు వాపోయారు.

పెండింగ్ పాఠ్యపుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 26: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పెండింగులో ఉన్న పాఠ్యపుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా నేటికీ చాలా పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు నోట్పుక్కులు అందలేదన్నారు. కార్యక్రమంలో నాయుకులు పవన్, సతీష్, రమేష్, వరుణ్ పాల్గొన్నారు.

న్యాక్ ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 26: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) ఉపాధి శిక్షణ తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జ్ బీజీ ఉలిగెన్న తెలిపారు. స్థానిక ఎమ్మిగనూరు సర్కిల్ కర్రెప్ప హాస్టల్లో న్యాక్ శిక్షణ కేంద్రంలో డెకరేషన్ పెయింటింగ్, ప్లంబర్, ఎలక్ట్రిషన్, తాపీమేస్త్రీలకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం అందించే సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9908 54147,93970 31486, సంప్రదించవచ్చని సూచించారు.

జర్నలిస్టు సమస్యలపై నిరంతర పోరాటం

మంత్రాలయం, జూన్ 26: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గం తాలుకా అధ్యక్షుడు వగరూరు జయరాజు అన్నారు. బుధవారం అబోడే అతిథి గృహంలో మంత్రాలయం తాలుకా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, నాలుగు మండలాల్లో ప్రెస్ క్లబ్ ఏర్పాటు, సంక్షేమ నిధి వంటి అంశాలపై చర్చించినట్లు జయరాజు తెలిపారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు రానోజీరావు, తాలుకా ప్రధాన కార్యదర్శి హుశేనీ, కోశాధికారి సాబువలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సూర్యనారాయణాచార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్త నోటీసులే!



ప్లాను మంజూరు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయం

- అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయంపై అధికారులు వెనకడుగు

ఆదోని టౌన్, జూన్ 26: పట్టణంలోని వైసీపీ కార్యాలయం అక్రమ కట్టడంగా తేలిపోవడంతో హడావుడి చేసిన మునిసిపల్ అధికారులు కేవలం నోటీసు జారీ చేసి మిన్నకుండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ప్లాను మంజూరుకు అదనంగా నిర్మించిన కట్టడాలను వెంటనే కూల్చివేసే అధికారులు వైసీపీ కార్యాలయం పూర్తిగా అక్రమ కట్టడంగా బహిర్గతమైనా, కేవలం నోటీసు జారీ చేసి వారి సమాధానం కోసం వేచిచూడడాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తప్పుపడుతున్నారు. అధికారుల అలసత్వాన్ని సహించే ప్రసక్తే లేదని, ప్రజలకు మంచి పాలనను అందించడానికే తాను ప్రాధాన్యత ఇస్తానని ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అన్నారు. కోర్టు నుంచి స్టే పొందడానికి అధికారులే సహకరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్లాను మంజూరు లేకుండా నిర్మాణం జరుగుతున్న సమయంలో పనులను అడ్డుకోకపోవడంపై విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలలో వైసీపీకు సంబంధించిన పలు అక్రమ కట్టడాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో స్థానిక టీడీపీ నాయకుడు ఉమ్మి సలీమ్, బీజేపీ నాయకులు దేశాయి చంద్రన్న, నాగరాజ్ గౌడ్, స్థానిక ఎస్కేడీ కాలనీలో ఇటీవల నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనంపై ఆరా తీయగా అక్రమ కట్టడంగా బయట పడింది. నాయకులు ఆరోపించే వరకు అధికారులకే ఈ విషయం తెలియకపోవడం వారి బాధ్యతారహిత పనితీరుకు నిదర్శనమంటూ పలువురు విమర్శిస్తున్నారు. ప్లాను మంజూరు లేకుండా నిర్మించిన భవనాన్ని సీజ్ చేస్తామని విలేకరులకు తెలిపిన మునిసిపల్ కమిషనర్, కేవలం నోటీసులు మాత్రమే ఇచ్చారు. అక్రమ నిర్మాణం జరుగుతున్న సమయంలో నోటీసుల ఇవ్వకుండా కాలయాపన చేసి, నిర్మాణం పనులు పూర్తయిన చాలాకాలానికి విషయం బయటపడటంతో నోటీసులు ఇచ్చారని తప్పుపడుతున్నారు. పట్టణంలో ఇలాంటి మరిన్ని అక్రమ పట్టడాలు జరిగినట్లు తమ వద్ద సమాచారం ఉందని, వాటిపై కూడా ఆరాతీస్తామని టీడీపీ, బీజేపీ నాయకులు తెలిపారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- తాత్కాలిక ఉపశమనం... భవిష్యత్తు అంధకారం
- ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ
- జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



పత్తికొండలో సెబ్, పోలీస్ ఆద్వర్యంలో ర్యాలీనిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని, జూన్ 26: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదామని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పిలుపునిచ్చారు. బుధవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సిల్వర్ జూబ్లీ హాల్ నందు సెబ్, లాండ్ అండ్ ఆర్డర్ పోలీసుల వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తాత్కాలిక ఉపశమనం కోసం భవిష్యత్తు అంధకారం చేసుకోకూడదని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, దుష్ప్రభావాలు, వాటిని అక్రమంగా రవాణా చేయడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన చిక్కులపై అవగాహన కల్పించారు. ఎక్కడైన మత్తు పదార్థాలు వాడకం జరుగుతున్నట్లయితే సమాచారం తెలియజేస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేకంపై ప్రతిజ్ఞ చేయించి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి జిమ్ సెంటర్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ డీఎస్పీ ధీరజ్, ప్రిన్సిపాల్ మురళీ మోహన్, సెబ్ సీఐ విన్నిలత, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, తేజ మూర్తి, నిరంజన్ రెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలో సీఐ రామకృష్ణయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. మారక ద్రవ్యాల సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీల్ నెం 14500 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పత్తికొండలో విద్యార్థుల ప్రదర్శన

పత్తికొండ : మత్తుతో జీవితాలు చిత్తవుతాయని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు.ఇంటర్‌నేషనల్ యాంటీడ్రగ్‌డే సందర్భంగా పత్తికొండలో సెబ్, పోలీస్ ఆధ్వర్యంలో అవగాహనార్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు యాంటీడ్రగ్‌డేపై డీఎస్పీ వివరించారు. అనంతరం సెబ్ సీఐ సువర్ణలత ఆధ్వర్యంలో జూనియర్‌కళాశాల, హైస్కూల్ విద్యార్థులతో కలసి తేరుబజార్‌వరకు ర్యాలీనిర్వహించి మానవహారం ఏర్పాటుచేశారు. సీఐ మురళీమోహన్ విద్యార్థులతో మత్తుమందులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞచేయించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ వీరేషప్ప, హైస్కూల్ హెచ్‌ఎం మాలతి, పీడీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి : కోసిగిలో డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా విద్యార్థులతో కలిసి సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ సతీష్ కుమార్, రమేష్‌బాబు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాల్మీకి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

హొళగుంద : మాదక ద్రవ్యాలకు అలవాటు పడి విద్యార్థులు జీవితం నాశనం చేసుకోవద్దని ఎస్సై పెద్దయ్య నాయుడు బుధవారం అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహణ సదస్సు నిర్వహించారు.

కాలం చెల్లిన బియ్యం పూడ్చివేత



కాలం చెల్లిన బియ్యాన్ని పూడ్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

ఆలూరు, జూన్ 26: ఆలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వఉన్న కాలం చెల్లిన బియ్యాన్ని అధికారులు పూడ్చివేశారు. బుధవారం 38.80 క్వింటళ్ల బియ్యం,73 కేజీల కంది బ్యాలు, 36 కేజీల చెక్కరను జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ సమీపంలో ఆర్ఐ బసవన్న గౌడ్, విఆర్‌వో సుధాకర్ ఆధ్వర్యంలో స్టాక్ పాయింట్ ఇన్‌చార్జీ రాఘవ రెడ్డి గుంతలో పూడ్చి వేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ బసన్న గౌడ్ మాట్లాడుతూ బియ్యంను కర్ణాటకకు తరలిస్తున్నట్లు వార్తలు రావడంతో జిల్లా అధికార్లు ఆదేశాల మేరకు ఆ కాలం చెల్లిన బియ్యంను పంచనామా నిర్వహించి పూడ్చివేసినట్లు పేర్కొన్నారు.

మహిళపై దాడి కేసులో ఐదుగురి అరెస్టు

మంత్రాలయం, జూన్ 26: రాఘవేంద్రపురానికి చెందిన మాదేవి అనే మహిళపై దాడిచేసిన బావ గుర్రాజు, లక్ష్మయ్య, రాఘవేంద్ర, రామలింగమ్మ, మనులక్ష్మిని అరెస్టు చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. రెండు రోజుల క్రితం మరదలు వివాహేతర సంబంధం కొనసాగిస్తోందన్న అనుమానంతో బావ, మరిది కత్తితో ఆమెపై దాడి చేసి గాయపరిచారు. బాదితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం గోశాల సమీపంలో ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా.. 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గోపినాథ్ తెలిపారు.

'తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'



తుగ్గలి నాగేంద్రను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూన్ 26: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని న్యాయవాదులు కోరారు. బుధవారం తుగ్గలి నాగేంద్రను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ ఇవ్వడం వల్ల టీడీపీ మరింత బలపడుతుందని అన్నారు. రాష్ట్రంలోనే కుమ్మర సామాజిక వర్గానికి ఎలాంటి పదవులు లేవని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మండలంలో పేదల కోసం ఉచిత వివాహాలు, ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.అగ్రహారం నెట్టికంటయ్య, సంజీవరెడ్డి, అశోక్, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి తిరుపాలు మాదిగ, పెరవలి జగన్నాథచౌదరి పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న కాలేజీకి వైఎస్సార్ పేరు

- అధికారులు, కాంట్రాక్టర్ల అత్యుత్సాహం ● మాజీ సీఎం జగన్ ఆదేశాలను పాటిస్తున్నారంటూ విమర్శ



ఆదోని రూరల్, జూన్ 26 : "ఇదేమిటీ... నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీకి డాక్టర్ వైఎస్సార్ పేరు పెట్టారు.." అంటూ ఆరేకల్ సమీపంలో నిర్మాణమవుతున్న మెడికల్ కళాశాలను చూసిన వారంతా ఆశ్చరం వ్యక్తం చేస్తున్నారు. ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లోని ఆరేకల్ సమీపంలో గత ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం వర్చువల్ 59 ఎకరాల 48సెంట్లలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం భూమి పూజ చేశారు. ప్రస్తుతం అక్కడ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఏ ఒక్క భవనం ఇంకా పూర్తి కాలేదు. నిర్మాణంలో ఉన్న భవనాల చుట్టూ రేకులతో ప్రహారీని ఏర్పాటు చేశారు. అయితే, కాంట్రాక్టర్, అధికారుల అత్యుత్సాంతో డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కాలేజీ అంటూ పెద్ద అక్షరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. "30శాతం కూడా పనులు పూర్తికాలేదు.. అన్నీ మధ్యలోనే ఉన్నాయి.. అయినా, వైసీపీ నాయకుల ఆదేశాలతో ఇంత పెద్ద అక్షరాలతో బోర్డు ఏర్పాటు చేయడం సబబేనా" అంటూ పలువురు నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న అధికారులను నిలదీస్తున్నారు. మాజీ సీఎం జగన్ ఆదేశాలను ఇక్కడ పనిచేసే అధికారులు ఇంకా పాటించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "వైసీపీ ప్రభుత్వంలో అరాచకం సృష్టిస్తూ దశాబ్దాల క్రితం గుంటూరులో ఉన్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి ఎన్టీఆర్ పేరు తొలగించి వైఎస్సార్ పేరు పెట్టిన సంగతిని కాంట్రాక్టర్లకు, అధికారులకు గుర్తులేదా" అంటూ కూటమి నాయకులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఏ భవనమూ పూర్తికాలేదు.. అయినా ఇలా నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీకి డాక్టర్ వైఎస్సార్ మెడి కల్ కాలేజీ అని ఎలా పెడుతారని అధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు.

30న సర్వసభ్య సమావేశం

ఆదోని టౌన్, జూన్ 26: పట్టణంలోని గాయత్రి బ్రాహ్మణ పరస్పర సహాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘం నిర్వాహకులు బుధవారం తెలిపారు. పొలిమేరలోని మంగరాయ స్వామి సన్నిధిలోని మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంకు చెందిన ఆదోని శాఖ ప్రాంగణంలో జరిగే సర్వసభ్య సమావేశంలో సంఘం నిధుల జమ ఖర్చులతో పాటు, వార్షిక నివేదికపై చర్చించి, కొత్త కార్యవర్గం సభ్యులను ఎన్నుకుంటారని, సభ్యులందరూ హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

కోట్లను కలిసిన టీడీపీ నాయకులు

తుగ్గలి, జూన్ 26: నిరంతరం ప్రజా సేవలో ఉండే కోట్ల కుటుంబానికి ప్రజలు పట్టం కట్టారని టీడీపీ సీనియర్ నాయకులు జొన్నగిరి పెద్ద తిమ్మయ్య అన్నారు. బుధవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని ఆయన కలిసి పూలమాలలు వేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల మంత్రి బుగ్గనను ఇంటికి సాగనంపి రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని తరిమికొట్టారనీ ప్రజలు వైసీపీ అరాచకాలను అరికట్టేందుకే టీడీపీకి పట్టం కట్టారనీ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు.

టీడీపీలో కాపులకు సముచిత స్థానం

తుగ్గలి, జూన్ 26: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కాపులకు సముచిత స్థానం ఇచ్చారని టీడీపీ సీనియర్ నాయకులు కాపు సంఘం జిల్లా నాయకులు అప్పా వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఉప్పర్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమిలో ఏర్పాటైన ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం సంతోషకరమని పేర్కొన్నారు.

అక్రమ తవ్వకాలు అడ్డుకున్న పోలీసులు

వెల్దుర్తి, జూన్ 26: మండలంలో గోవర్దనగిరి చెరువు సమీపంలో గ్రావెల్ కోసం అక్రమ తవ్వకాలు చేపడుతున్న వాహనాలను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జేసీబీతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా పొలానికి గ్రావెల్ తరలిస్తున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సిబ్బంది ఆ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని తవ్వకాలు చేపడుతున్న వారిని అడ్డుకున్నారు. పోలీసులు రావడంతో వాహనదారులు పరారయ్యారు.

సంక్షిప్తం

మధ్యంతర భృతి ప్రకటించాలి

దేవనకొండ ,జూన్ 26 : ప్రభుత్వం ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గట్టు.తిమ్మప్ప అన్నారు. బుధవారం మండలంలోని తెర్నేకల్ ,మాచాపురం ,కప్పట్రాళ్ల పాఠశాలలో ఆయన పర్యటించి ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న చోట వలంటరీలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులపై అదనపు భారం లేకుండా చుడాలన్నారు. విద్యా రంగాన్ని పరిరక్షించేలా జీవో 117 రద్దు చేయాలన్నారు. తరగతిలో విద్యార్థీ నిష్పత్తి 40 శాతానికి తగ్గించాలన్నారు.జిల్లా ఉపాధ్యక్షులు రోషన్న ,మండల అధ్యక్ష,కార్యదర్శులు ఇమ్మానేయులు ,మనోహర్ ,బజారప్ప ఉన్నారు.

బీడి బంకులో చోరీ

దేవనకొండ ,జూన్ 26 : కరిడికొండ బస్టాండ్ పక్కన్న ఉన్న బీడి బంకులో చోరీ జరిగింది. రూ.15 వేల విలువ చేసే వస్తువులు చోరికి గురైన్నట్లు బంకు యజమాని రాజు తెలిపారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు బంకు వెనకాల భాగంలో పగలగొట్టి లోపల వున్న వస్తువుల మొత్తం తీసుకెళ్లిన్నట్లు బాధితుడు వాపోయారు. ఎంపీపీ పాఠశాలలో గది తాళం పగలగొట్టి మూడు ప్యాకెట్లు చిక్కీలను తీసుకెళ్లారని ఉపాధ్యాయుడు పాండురంగా తెలిపారు.

వ్యక్తి అరెస్టు

ఆదోని రూరల్, జూన్ 26 : కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చెందిన చంద్రశేఖర్‌ను పెద్దతుంబళం పోలీసులు అరెస్టు చేశారు. ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న సదరు వ్యక్తిని బుధవారం కుప్పగల్లు క్రాస్ వద్ద అదుపులో తీసుకొని 150 మద్యం ప్యాకెట్లతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మానవ హక్కుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఆదోని రూరల్, జూన్ 26 : మానవ హక్కుల రక్షణకు కలిసి కట్టుగా ముందుకెళ్దామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. బుధవారం స్థానిక బార్ అసోసియేషన్‌లో న్యాయవాదుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మానవ హక్కులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా తన గెలుపుకోసం పనిచేసిన ప్రతి న్యాయవాదికి ధన్యుడనై ఉంటానని పేర్కొన్నారు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

దేవనకొండ ,జూన్ 26 : సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మండల సర్పంచులు 5వ ఆర్థికసంఘం ప్రతినిధులను కలిశారు. సర్పంచులు ఆరుణ్‌కుమార్, భాస్కర్, మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలన్నారు. కరెంటు బిల్లు 2011 జనాభా ప్రతిపాధికన కాకుండా ప్రస్తుత జనాభాకి అనుగుణంగా నిధులు మంజూరు చేయాలని , సచివాలయాలను ప్రభుత్వమే భరించాలని, ఉపాధిలో 40శాతం మెటీరియాల్ ఖర్చు పంచాయతీలకే కేటాయించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 26: పురపాలక పాఠశాలల్లో విద్యార్థులు గణనీయంగా పెరిగారని, వారికి అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు కోరారు. బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలిసి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో గత 14 ఏళ్ల కిందట అప్ గ్రేడ్ పైన ఉన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలన్నారు. అసెంబ్లీలో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్, నాగేంద్రప్ప, నరసింహులు, పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవి, భీమరాజు, రాజా సతీష్, ఉరుకుందప్ప, ప్రహ్లాద, రామయ్య నాగప్రసాద్, జ్యోతి మూర్తి పాల్గొన్నారు.

ఏపీపీఆర్‌ఎంఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎమ్మిగనూరు, జూన్26: ఏపీపీఆర్‌ఎంఈఏ ఎమ్మిగనూరు తాలుక నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం దగ్గర ఎన్నికల అధికారి ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో నూతన కమిటిని ఎన్నుకున్నారు. తాలుకా అధ్యక్షుడిగా రాజానందం(జూనియర్ అసిస్టెంట్,ఎంపీపీ) వైస్‌ప్రసిడెంట్‌గా వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా అబ్దుల్ రహిమాన్, ట్రెజరర్‌గా మోహన్ రాజు, సహాయ కార్యదర్శిగా మధుసూదన్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నాగప్రసాద్, క్రిష్ణమూర్తి, కో-ఆప్షన్ సభ్యులుగా మేరి సురాని, జీఆర్ మేరీ శిరీషాలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుందని తెలిపారు.